



పెద్దకొడప్గల్‌లో డ్రైనేజీ లేక మట్టిరోడ్డుపైనే నిల్వ ఉన్న మురుగు నీరు



ఎల్లారెడ్డి శివారులో చికెన్ వ్యర్థాలను పార వేయడంతో కుక్కల స్వైర విహారం



నిజాంసాగర్‌లో నిర్వహణ లేక మూలనపడ్డ చెత్త ట్రాక్టర్



లింబూర్ ఎస్సీ వాడలో తాగునీటి కోసం మహిళల పడిగాపులు

ఆంధ్రజ్యోతి విజిట్

అస్తవ్యస్తంగా.. ప్రత్యేక పాలన!

- ఏడాదిగా పడకేసిన పల్లెలు
- గ్రామాల్లో కనిపించని పారిశుధ్య పనులు
- రోడ్లపైనే మురుగు ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం
- పలు పంచాయతీల్లో మూలనపడిన ట్రాక్టర్‌లు, ట్యాంకర్లు
- డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు లేక ఇబ్బందులు
- తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న పల్లెవాసులు
- పల్లెల్లో నిధులు లేక కష్టంగా నిర్వహణ
- పని ఒత్తిడిలో పంచాయతీ కార్యదర్శులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు లేక పల్లెల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. పాలకవర్గాల గడువు ముగిసి అధికారులకు ప్రత్యేక పాలన అప్పగించడంతో పల్లెలు పడకేస్తున్నాయి. కనీసం పారిశుధ్య పనులు కూడా నిర్వహించలేని పరిస్థితి ఎదురవుతోంది. ఇక వేసవి మొదలవ్వడంతో పల్లె ప్రజలకు తాగునీటి కష్టాలు అంతా ఇంత కావు. ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ గ్రామాల్లో చుట్టపు చూపులాగానే వస్తూ పోతున్నారే తప్ప సమస్యలు పరిష్కారం చూపడం కాదు కదా వినేవారే లేరంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా ఏ గ్రామంలో చూసినా పారిశుధ్య లోపం కొట్టచ్చినట్లు కనిపిస్తోంది. రోడ్లపైనే మురుగు, చెత్తా చెదారం పేరుకపోతున్నాయి. పచ్చదనం, స్వచ్ఛదనం తూతూ మంత్రంగా తయారైంది. కనీస సౌకర్యాలు లేక ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన వచ్చి ఏడాది పూర్తవడంతో పల్లెల్లో నెలకొన్న సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించింది.

గ్రామాల్లో కనిపించని పారిశుధ్య పనులు

గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం వీధుల్లో నీటి నిల్వలు ఉండడంతో దోమలు ప్రబలి ప్రజలు విషజ్వరాల భారిన పడుతున్నారు. వీధుల్లో చిన్నగుంతలు ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకపోతున్నది. ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు ఎప్పుడో ఒకప్పుడు వచ్చి వెళ్తుంటే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకాధికారులు కేవలం సంతకాలకే పరిమితం అవుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో మురికి కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కనీసం మురికి కాలువలను శుభ్రం చేసే నాథుడే లేకపోయారు. గ్రామ శివారులో చికెన్ వ్యర్థాలను పారబోస్తుండడంతో కుక్కలు స్వైర విహారం చేస్తుండడమే కాకుండా దుర్వాసన వెదజల్లుతోంది. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్‌లో మురికి కాలువల్లో పూడిక తీయడం లేదు. బీర్కూర్ గ్రామ పంచాయతీలో మురికి కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు అంతా రోడపైకి ప్రవహిస్తుండడంతో రహదారులపై వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. దోమలు విజృంభిస్తున్నాయి. చెత్త సేకరణ సకాలంలో చేయకపోవడంతో రోడ్లన్నీ చెత్తమయంగా మారుతున్నాయి. డోంగ్లి మండలం హసన్‌టాక్లి వద్ద ఏర్పాటు చేసిన కంపోస్టుషెడ్ చెత్తా చెదారంతో పేరుకపోయింది. స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్దే చెత్త కుప్పను వేయడంతో పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట గ్రామంలో చెత్తసేకరణ జరగడం లేదు. దీంతో ప్రధాన కూడళ్లలో చెత్త పేరుకపోయి రోడ్లు, డ్రైనేజీలు కూరుకపోతున్నాయి. నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, బిక్కనూరు, బిచ్కుంద, కామారెడ్డి మండలాల్లోని చాలా గ్రామాల్లో మురికి కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.

తీవ్ర తాగునీటి ఎద్దడి

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ పరిధిలో 526 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎండాకాలం ప్రారంభం కావడంతో గాంధారి, జుక్కల్, నాగిరెడ్డిపేట, తాడ్వాయి, లింగంపేట, సదాశివనగర్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో మంచినీటి సరఫరా సకాలంలో కావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు ఉన్న నీటి సరఫరా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి దీంతో పంట పొలాల్లోని మోటార్‌బోరు బావులు, చేద బావులు చెరువుల వద్దకు వెళ్లి తాగు నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లాలకు నీటి సరఫరా కాక నిరుపయోగంగా మారుతున్నాయి. కనీసం ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేయడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రత్యేకాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు లేక కష్టంగా గ్రామాల నిర్వహణ

గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో నిధులు విడుదల చేయడం లేదు. దీంతో పంచాయతీల్లో నిధుల కొరత ఎదురవుతోంది. గ్రామాల నిర్వహణ కష్టంగా మారుతోంది. సంవత్సర కాలంలో పంచాయతీలు నిధుల లేమీతో కొట్టుమిట్టాడుతుండడంతో పాలన స్తంభించిపోయింది. మల్టీ పర్పస్ కార్మికులకు మాత్రమే వేతనాలను వారి ఖాతాలో జమ చేస్తున్నారు. గత ఏడాది ఇంటి పన్నుల వసూళ్లతో కార్మికుల వేతనాలు చెల్లించారు. వీధిలైట్లు, తాగునీటి క్లోరినేషన్ ఇతరత్రా నిర్వహణ అంతా పన్నుల రూపేనా వచ్చిన నిధులతో చేపడుతుండగా మరికొన్ని చోట్ల కార్యదర్శులు సొంత డబ్బులతో నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బకాయిలు రూ.2.41కోట్లు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు రూ.2లక్షలు మాత్రమే చెల్లించారు. కనీసం విద్యుత్ చార్జీలు కూడా కట్టుకోలేని పరిస్థితి ఇక చెత్త సేకరించే ట్రాక్టర్‌లకు డీజిల్ లేక నిర్వహణకు నిధులు లేక మూలనప డుతున్నాయి. దీంతో చెత్తసేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అభివృద్ధి పనుల ఊసేలేదు

గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో

(మిగతా 8వ పేజీలో)



పిట్లంలో రోడ్డు పక్కన పారుతున్న మురికి నీరు



హసన్‌టాక్లిలో నిరుపయోగంగా వర్మి కంపోస్ట్ షెడ్డు



బీర్కూర్‌లో నిరుపయోగంగా మిషన్ భగీరథ నల్లా



బీర్కూర్‌లో చెత్తతో కూరుకుపోయిన కాలువ




ఆరేపల్లిలో నిర్వహణ లేక బోసిపోయిన పల్లె ప్రకృతి వనం

జుక్కల్ పదో తరగతి పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నల లీక్

- తెల్ల పేపర్‌పై ఐదు ప్రశ్నలు రాసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్
- పరీక్ష కేంద్రంలోని ఓ విద్యార్థి ప్రశ్నలు రాసి బయటకు పంపినట్లు సమాచారం
- మ్యాథ్స్ ప్రశ్నపత్రంలో ఉన్న బయటకు లీకైన ప్రశ్నలు
- పరీక్ష కేంద్రంలో విచారణ జరిపిన సబ్ కలెక్టర్ కిరణ్మయి
- జుక్కల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కామారెడ్డి డీఈవో
- సీఎస్, డీవో, ఇన్విజిలేటర్‌ల సస్పెన్షన్

కామారెడ్డి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జుక్కల్ మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రం నుంచి పలు ప్రశ్నలు లీకైనట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడం కలకలం రేపుతోంది. బుధవారం జరిగిన పదో తరగతి మ్యాథ్స్ పరీక్ష ప్రశ్నపత్రంలోని కొన్ని ప్రశ్నలు తెల్ల కాగితంపై రాసిన ఫొటోలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై జిల్లా అధికారులు సైతం విచారణ చేపడుతున్నారు. జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రం కొనసాగుతోంది. బుధవారం మ్యాథ్స్ పరీక్ష జరిగింది. ఈ మ్యాథ్స్ పరీక్షలో మొత్తం 18 ప్రశ్నలు వచ్చాయి. జుక్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో పరీక్ష మొదలైన కొన్ని నిమిషాలకు ప్రశ్న పత్రంలోని ఐదు (13,14,15,16,17) ప్రశ్నలు ఓ తెల్ల కాగితంపై రాసిన ఫొటోలు బయటకు వచ్చాయి. ఈ ఫొటోలు కాస్త సోషల్ మీడియాలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వైరల్ చేశారు. జుక్కల్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నలు లీకయ్యాయంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అయితే లీకైన ఐదు ప్రశ్నలు మ్యాథ్స్ ప్రశ్నపత్రంలో ఉన్నాయి. దీంతో విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు పరీక్ష కేంద్రానికి చేరుకుని విచారణ చేపట్టారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, కేంద్రంలోని ఇన్విజిలెటర్‌లను సబ్ కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే తెల్ల కాగితంపై ప్రశ్నలు పరీక్ష రాసే సమయంలోనే బయటకు వచ్చాయా లేదా పరీక్ష అయిపోయాక ఎవరైన అగంతకులు కాగితంపై ప్రశ్నలు రాసి కావాలనే వైరల్ చేశారా అనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే పరీక్ష కేంద్రంలోని ఓ విద్యార్థి కొందరు సిబ్బంది సహకారంతో తెల్ల కాగితంపై ఐదు ప్రశ్నలను రాసి కిటికిలోంచి బయటకు పారేశాడని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' జిల్లా విద్యాశాఖాధికారి రాజును వివరణ కోరగా విద్యార్థులకు అందించే ప్రశ్నపత్రంకు బార్‌కోడ్ ఉంటుందని ఎవరో గుర్తుతెలియని వ్యక్తి తెల్లకాగితంపై ప్రశ్నలు రాసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని జుక్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. జుక్కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన తెల్ల కాగితంపై రాసిన ప్రశ్నలు

పోలీసుల అదుపులో ఆరుగురు వ్యక్తులు


జుక్కల్: జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్ష కేంద్రం నుంచి మ్యాథ్స్ పరీక్షకు సంబంధించి పలు ప్రశ్నలు లీకైన సంఘటనలో ఆరుగురు వ్యక్తులను జుక్కల్ పోలీసులు అదు పులోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రశ్నల లీక్‌పై జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపడు తున్నారు. కొందరు వ్యక్తులు పదో తరగతి మ్యాథ్స్ ప్రశ్నపత్రంలోని కొన్ని ప్రశ్నలను ఓ తెల్లకాగితంపై రాసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఘటనపై డీఈవో రాజు జుక్కల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మొదట ప్రశ్నలను సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు అనుమానిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జిల్లా ఏఎస్పీ నరసింహారెడ్డినివివరణ కోరగా విచారణ కొనసాగుతుందని తెలిపారు.

ప్రశ్నల లీకేజీ వాస్తవమే.. : సబ్ కలెక్టర్ కిరణ్మయి

జుక్కల్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన మ్యాథ్స్ పరీక్షకు సంబంధించిన ఓ విద్యార్థి తెల్ల కాగితంపై ప్రశ్నలు రాసిచ్చి పరీక్ష కేంద్రంలోని వాటర్ సప్లయ్ చేసే వాటర్‌మెన్‌కు అందించడంతో అతను విద్యార్థి తండ్రికి ఆ పేపర్‌ను అందించాడు. సదరు పేపర్‌ను ఒకరిద్దరు రిపోర్టర్లు వైరల్ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించాం. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సీఎస్, డీవో, ఇన్విజిరేటర్లపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సీఎస్, డీవో, ఇన్విజిలేటర్‌ల సస్పెన్షన్ : డీఈవో

కామారెడ్డి టౌన్: జుక్కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రంలో మ్యాథ్స్ పరీక్ష ప్రశ్నల లీకేజీకి సంబంధించి సీఎస్ (చీఫ్ సూపరింటెండెంట్) సునీల్, డీవో (డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్) భీమ్, ఇన్విజిలేటర్ దీపికలను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం జుక్కల్ పరీక్ష కేంద్రం నుంచి పరీక్ష ప్రశ్నపత్రంలోని కొన్ని ప్రశ్నలను కాగితంపై రాసి బయటకు పంపించడం జరిగిందని సామాజిక మాధ్యమాలలో బయటకు వచ్చిన సందర్భంగా సబ్ కలెక్టర్, జుక్కల్ ఎంఈవోలతో కలిసి విచారణ జరిపి బాధ్యులైన సీఎస్, డీవో, ఇన్విజిలేటర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో తెలిపారు.



జుక్కల్ పరీక్ష కేంద్రంలో విచారణ చేపడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



సబ్ కలెక్టర్, డీఈవోతో మాట్లాడుతున్న ఏఎస్పీ నరసింహారెడ్డి

జిల్లా వ్యాప్తంగా ఫైనాన్స్ వ్యాపారాలపై ఆకస్మిక తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మార్గాల ద్వారా అధిక వడ్డీలు ఇస్తూ ప్రజలను వేధింపులకు గురిచేయడంతో 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 22న వచ్చిన 'ఫైనాన్స్ వేధింపులు' అనే కథనానికి జిల్లా పోలీసు యంత్రాంగం స్పందించింది. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ అక్రమ వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి కేంద్రాలపై పోలీసు యంత్రాంగం దాడులు చేసి డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుందని తెలిపారు. జిల్లాలో అనుమతులు లేకుండా కొందరు మోసపూరిత మాటల ద్వారా మరి కొందరు వ్యాపారులు అమాయక ప్రజలను చూసి ఆర్థిక సహాయం చేస్తామని నమ్మించి వారి వద్ద నుంచి ఇల్లు, ప్లాట్లు, వ్యవసాయ భూముల దస్తావేజులను తీసుకుని అప్పులు ఇస్తున్నారని తెలిపారు. తిరిగి డబ్బులు చెల్లించాలని అధిక వడ్డీ రేట్ల లెక్కలు చూపుతూ చెల్లించలేని పరిస్థితులను తీసుకువచ్చి వారి ఆస్తుల దస్తావేజులను జప్తు చేసుకోవడం జరుగుతుందని ఇలా వ్యాపారం చేస్తున్నారని సమాచారంతో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో దాడులు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 69 చోట్ల రైడ్స్ చేయగా 16 కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి విలువైన డాక్యుమెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. వ్యాపారులు చేస్తున్న ఆర్థిక మోసాలను తట్టుకోలేక ఎంతోమంది బాధితులు కుటుంబ సమేతంగా ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిందన్నారు. ఆత్మహత్యలు నివారించాలనే అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో మోసపూరిత వ్యాపారులపై దాడులు చేశామని ఎస్పీ తెలిపారు.



కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో తనిఖీలు చేస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



కామారెడ్డి పరీక్ష కేంద్రంలోని అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం పట్టణంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదులను, చీఫ్ సూపరింటెండెంట్ గదులను పరిశీలించి పరీక్ష సమయానికి ముందే విద్యార్థులను నిశిత పరిశీలన చేసి కేంద్రంలోనికి పంపించాలని, మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడకుండా పరిశీలించాలని తెలిపారు. కేంద్రంలో తాగునీరు, టాయిలెట్స్, మెడికల్ సదుపాయాలు, రవాణా వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ వెంకటరమణ, డీవో మేరి వర్ధనం, తహసీల్దార్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలి

అర్హులైన నిరుపేద లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు మార్కవుట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అర్హులైన నిరుపేద లబ్ధిదారుల జాబితాల ప్రతిపాదనల మేరకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిర్మాణాలకు సిద్ధంగా ఉన్న లబ్ధిదారులకు మార్క్‌వుట్ ఇవ్వాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలని, బేస్‌మెట్ వరకు ఇంటి నిర్మాణాలు జరిగిన వాటి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని వాటికి ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు మొదటి విడతలో ప్రభుత్వం నుంచి నిధులు లబ్ధిదారునికి విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా ప్రారంభించని ఇళ్లను త్వరగా నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. లబ్ధిదారులను నిర్మాణా లకు ప్రోత్సహించాలని సూచించారు. ఇందిరమ్మ డెమో ఇళ్లను త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. రెండు పడక గదుల నిర్మాణాల కాలనీల్లో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయా పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో చందర్, హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, డీఆర్‌డీవో పీడీ సురేందర్, పంచాయతీరాజ్ ఈఈ దుర్గాప్రసాద్, ఆంజనేయులు, మిషన్ భగీరథ ఇంజనీర్లు పాల్గొన్నారు.

మామిడిపల్లి చౌరస్తాలో హోటళ్ల తనిఖీ



టిఫిన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్‌మార్చి26(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిచౌరస్తా పాటు పలు ప్రాంతాల్లోని హోటళ్లు, టిఫిన్‌సెంటర్, చికెన్, మటన్ సెంటర్‌లపై మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు హోటళ్లు, టిఫిన్‌సెంటర్, చికెన్, మటన్ సెంటర్, వ్యాపార సముదాయాల వద్ద పరిశుభ్రత పాటించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్‌లను వాడవద్దని, లేని యెడల భారీ జరిమానాలు విధిస్తామని షాప్ యజమానులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, సిబ్బంది అక్షయ్, ప్రశాంత్, నవీన్, పాల్గొన్నారు.

కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర



నందిపేట నుంచి పాదయాత్రగా కొండగట్టుకు వెళ్తున్న హనుమాన్ స్వాములు

నందిపేట,మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పలువురు ఆంజనేయ మాలధారణ స్వాములు బుధవారం కొండగట్టు ఆలయానికి పాదయాత్రగా బయలు దేరారు. మండల కేంద్రంలోని శ్రీకేదారేశ్వర ఆశ్రమం లో ప్రత్యేక పూజలు చేసిన హనుమాన్ దీక్షా పరులు మండలంలోని వెల్మల్, ఆలూర్, ఆర్మూర్ మండలాల మీదుగా జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయానికి వెళ్తున్నట్లు స్వాములు తెలిపారు.ఆంజన్న ఆలయం స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం తిరుగు ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ దీక్షా పరులలో తిమ్మల ప్రశాంత్, జైపాల్, దమ్మాయి శ్రీను తదితరులు ఉన్నారు.

రక్తదానానికి ముందుకు వచ్చిన యువత

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వల కొరత, వేసవి కాలంలో ముందుకు రాని రక్తదాతలు అనే కథనానికి స్పందించిన యువత స్వచ్ఛందంగా బుధవారం బోధన్ బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తదానం చేశారు. హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో పాటు యువత ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. యువతలో మానవత విలువలు పెరుగుతున్నాయని అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని యువకులు పేర్కొన్నారు.

ఆర్మూర్ నియోజక వర్గ బీఎస్‌పీ అధ్యక్షుడిగా బొర్రోల్ల సురేష్

నందిపేట,మార్చి 26 (ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రానికి చెందిన బొ ర్రోల్ల సురేష్ బుధవారం ఆర్మూర్ నియోజక వర్గం బహుజన సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. ఈసంద ర్భంగా సెంట్రల్ కోఆర్డినేటర్ సిషాని రాంచంద్రం, రాష్ట్ర కార్యదర్శులు గైని గంగారాం, ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు సింగడే పాండు నియామక పత్రాన్ని బొర్రోల్ల సురేష్‌కు అందజేశారు.ఆర్మూర్ నియోజక వర్గం లో బడుగు,బలహీన వర్గాల విద్యార్థులు,రైతులు, కార్మికులు అందరిని ఏకం చేసి బహుజనసమాజ్‌వాదిపార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, సమస్యలపై పోరాటం చేస్తానని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్ తెలిపారు.

ఇద్దరు డ్రైవర్లకు జైలుశిక్ష

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి నలుగురు మృతికి కారణమైన ఇద్దరు డ్రైవర్లకు జైలుశిక్ష విధిస్తూ బోధన్ జడ్జి సాయి శివ తీర్పును వెలువరించారు. 03-10-2014రోజున అక్బర్‌నగర్ గ్రామ శివారులో ఆటో, తుఫాన్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు చనిపోగా మరో పాప చికిత్స పొందుతూ మృతి చెందింది. అప్పటి వర్ని ఎస్ఐ సుఖేందర్ రెడ్డి కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురు మృతికి కారణమైన తుఫాన్ వాహనం డ్రైవర్ శివాజీ బలరాం, ఆటో డ్రైవర్ షేక్.మసీద్‌లపై కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురి మృతికి కారణమైన తుఫాన్ డ్రైవర్‌కు మూడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు 3వేల రూపాయల జరిమాన విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌కు మూడు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమాన విధించారు. ఆటో డ్రైవర్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు రద్దు చేసినట్లు రుద్రూరు ఎస్ఐ సాయన్న తెలిపారు.

ఇంటిని కూల్చివేసిన వారిపై కేసు నమోదు

వేల్పూర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో అక్రమంగా బచ్చుగంగాధర్ ఇంటిని నిర్మించుకున్నాడంటూ గ్రామ స్థులు బుధవారం ఉదయం 5గంటల సమయంలో బ్లేడ్ ట్రాక్టర్‌తో బిచ్చు గంగాధర్ ఇంటిని కూల్చివేశారని ఎస్సై సంజీవ్ తెలిపారు. ఈ ఘటనపై బుచ్చి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని రమేష్ గౌడ్‌కు చెందిన ట్రాక్టర్ రాకేష్‌లను రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపించా మన్నారు. మరి కొంత మంది నిందితులు పరారీలో ఉన్నారన్నారు. మండలం లోని అన్ని గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలు ఏర్పాటు చేసుకున్న అభివృద్ధి కమిటీలు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అంతేకానీ ఈ విధంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని చట్టవ్యతిరేకమైన పనులను చేయకుండా ఉండాలని ఎస్సై హెచ్చరించారు. మీకేమైన ఇబ్బందులు ఉంటే సంబంధిత శాఖల అధికారులకు సమస్యలను తెలియపరిచి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

శివాలయ సాగు భూముల కౌలుకు వేలం

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏక చక్రేశ్వరాయ శివాలయం సాగు భూముల కౌలుకు గురువారం ఆలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా ఏడుగురు వ్యవసాయదారులు వేలంపాటలో పాల్గొనగా ఉద్మీర్ గల్లీకి చెందిన కే.దశంధర్ అనే వ్యక్తి రెండు సంవత్సరాల లీజు కొరకు 54 వేల రూపాయలకు పాట పాడి వేలంపాటలో దక్కించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల, ఈవో రాములు, ఆలయ కమిటీ అధ్యక్షులు హరికాంత్ చారి, భూమేష్, మహేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి



రెంజల్ సొసైటీలో చిట్టాపద్దులు వినిపిస్తున్న కార్యదర్శి ఇంద్రసేన్

రెంజల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): రైతులు దీర్ఘకాలిక రుణాలతో పాటు స్వల్పకాలిక రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని రెంజల్ సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, నీలా సొసైటీ చైర్మన్ ఇమామ్ బేగ్‌లు అన్నారు. బుధవారం రెంజల్ ప్రాథమిక సహకార సంఘం, నీలా ప్రాథమిక సహకార సంఘాలలో చైర్మన్‌లు మొయినోద్దీన్, ఇమామ్ బేగ్‌ల ఆధ్వర్యంలో మహజన సభను నిర్వహించారు. కార్యదర్శులు ఇంద్రసేన్, రాందాస్‌లు సొసైటీకి సంబంధించిన లావాదేవీల చిట్టాపద్దులను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రైతులు దీర్ఘకాలిక రుణాలను వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేసుకుని సొసైటీకి సహకరించాలన్నారు.అలాగే స్వల్పకాలిక రుణాలను సైతం రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు ఇంద్రసేన్, రాందాస్, సొసైటీ డైరెక్టర్లు ఆసాని ప్రశాంత్, అగ్గు నారాయణ, బొడ్డొళ్ల సాయిలు, సుధాకర్, ఖదీర్ పాషా, అయిటి చంద్రకళ, మన్నె సావిత్రి, సలీం బేగ్, ఆకాష్, లాయక్ అలీ ఖాన్, సిబ్బంది సాయిబాబా, కిషోర్, శ్రీనివాస్, శంకర్, హరీష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: నవీపేట సొసైటీ మహజన సభను గురువారం నిర్వహించడం జరుగుతుందని సొసైటీ కార్యదర్శి మహేష్ తెలిపారు. ఉదయం 11గంటలకు సొసైటీ కార్యాలయం ఆవరణలో జరిగే మహజన సభను సొసైటీ చైర్మన్ అబ్బన్న అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సంఘ సభ్యులు సకాలంలో మహజన సభకు హజరుకావాలని ఆయన కోరారు.

మోస్రా: చందూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో అధ్యక్షుడు ప్యారం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో మహజన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించి గత సంవత్సరం 01-01-2024 నుంచి 25-03-2025 వరకు జరిగిన జమ, ఖర్చుల ఆమోదంపై పూర్తి వివరాలు తెలిపారు. అదే విధంగా వరి కొనుగోలు గురించి చర్చించడం జరిగింది. హమాలీ ఖర్చు రూ.14, బత్తా కింద ఒక్క రూపాయిని లారీ బత్తా ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘ డైరెక్టర్‌లు మద్దూరి మాధవ రెడ్డి, కోతోల్ల శ్రీనివాస్ రెడ్డి, జుకడి లక్ష్మి, మేడిపల్లి సాయిలు, రాథోడ్ భజన్‌లాల్, నీరడి బాలయ్య, అంగోత్ శంకర్, రైతులు పాల్గొన్నారు.

కమలాపూర్‌ను సందర్శించిన అటవీశాఖ అధికారులు



చిరుత పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించిన అటవీశాఖ బీట్ ఆఫీసర్

నవీపేట,మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమాపూర్ గ్రామాన్ని బుధవారం అటవీశాఖ బీట్ ఆఫీసర్లు సుదీర్, నవీన్‌లు సందర్శించారు. గత రెండు రోజులుగా గ్రామ శివారులోని చీమల గుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు పలువురు పేర్కొనడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికితీసుకెళ్లగా బీట్‌ఆఫీసర్లుగ్రామాన్ని సందర్శించారు.చిరుతపులి సంచారాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలనివారు సూచించారు. అంతే కాక బుధవారం సాయంత్రం ధర్మారంవైపు సంచరిస్తూ యువకుని వెంటపడిందని సమాచారం. అనంతరం ఉపాధిహామీకూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.కమలాపూర్‌లో చిరుత పులిసంచారం విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని బీట్‌ఆఫీసర్లు పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో తైబజార్ వేలం వాయిదా



వేలం పాటను వాయిదా వేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్ మార్చి26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని తైబ జార్ వేలంను వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వ హించిన వేలం పాటలో ప్రభుత్వ కనీస ధర రూ.29లక్షల 63వేల 740లు ఉండగా వేలంలో పాల్గొన్న ఇద్దరు కాంట్రాక్టర్‌లు ఎవరు ముందుకు రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే వేలం పాటలో పాల్గొనేవారు ఈనెల 28న మధ్యాహ్నం 1గంట వరకు కమిషనర్, ఆర్మూర్ మున్సిపాలిటీ పేరు పైనా రూ.5లక్షల డీడీ, రూ.5వేల (నాన్ రిఫండబుల్) డీడీలు చెల్లిం చి అదే రోజున సాయంత్రం 4గంటలకు తైబజార్ వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

పెద్దమల్లారెడ్డిలో తైబజార్ వేలం

భిక్కనూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ తైబజార్ వేటం కార్యక్రమాన్ని గ్రామప్రత్యేక అధికారి ఆనందం సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయితీ ఈవో లక్ష్మీ మాట్లాడుతూ గ్రామపంచాయితీ ఆవరణలో నిర్వహించిన తై బజార్ వేలంను గ్రామానికి చెందిన బుడ్డ శ్రీనివాస్ రూ.3.50లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. పశువుల సంతకు సంబంధించిన తైజార్ వేలానికి కనీస ధర రానందరున వాయిదా వేయ్యడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

లింగంపేట తైబజార్ వేలం

లింగంపేట,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లింగంపేట గ్రామపంచాయితీ తైబజా ర్ వేలం పాటను బుధవారం నిర్వహించగా వేలంపాటలో రూ.6లక్షల75 వేలకు ఎలా రెడ్డికి చెందిన మూజీబ్ దక్కించుకున్నట్లు పంచాయితీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈటెండర్ ఒక సంవత్సరం పాటు ఉంటుందని ఆయన తెలియజేశారు.

డొంకేశ్వర్‌లో వారసంత వేలంపాట

డొంకేశ్వర్, మార్చి26(ఆంధ్రజ్యోతి) డొంకేశ్వర్ మండలంలో జరుగుతున్నటువంటి గ్రామ వారసంత వేలం 2025-26 సంవత్సరానికి గాను ఈనెల 28తేదీ శుక్రవారం వారసంత వేలం పాట నిర్వహించనున్నట్టు పంచాయతీకార్యదర్శి తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు గ్రామపంచాయతీలో వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు ఉదయం 10గంటల లోపు పంచాయతీలో రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

కోస్లీ వారాంతపు సంత వేలం

నవీపేట,మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతకు బుధవారం వేలంపాట నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేలంపాటలో ఐదుగురు వేలంపాటదారులు పాల్గొనగా ఇందులో నవీపేటకు చెందిన మట్ట బాలాజీ సంతను ఒక లక్ష 500రూపాయలకు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజేష్ తదితరులున్నారు.

మోర్తాడ్‌లో 29న వాహనాల వేలం

మోర్తాడ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు వాహనాల వేలం నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ గుండప్ప తెలిపారు. ఈ వేలంలో టీవీఎస్ ఎక్సెల్, ద్విచక్ర వాహనం వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనేందుకు 25శాతం ఈఎండి చెల్లించాలని కోరారు.

మిట్టాపూర్ గోదావరిలో మునిగి జాలరి మృతి

నవీపేట,మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ గోదావరిలో ప్రమాదవశాత్తు మునిగి అదే గ్రామానికి చెందిన మేకల లస్మన్న(49)అనే జాలరి మృతి చెందాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. మంగళవారం గోదావరిలో చేపలు పట్టడానికి వెళ్లిన లస్మన్న సాయంత్రం ఇంటికి చేరుకోలేదని అతని ఆచూకీ విషయంపై కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ సమాచారం లభించలేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉదయం గోదావరిలో లస్మన్న మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య పోసాని, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు అవస్థలు

ఆర్మూర్‌టౌన్, మార్చి26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాల యంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఎల్‌ఆర్ ఎస్ దరఖాస్తుదారులు ఫీజును చెల్లించడానికి వెల్లడంతో సర్వర్ సమస్యతో ఆలస్యం అవుతుండగా ఫీజు చెల్లించిన వారికి ప్రొసిడింగ్ కాపీని ఇవ్వడానికి ఒకే ప్రింటర్ ఉండడంతో చాలా సమయం పడుతుంది. దీనికి తోడు వచ్చిన దరఖాస్తుదారులకు క్యాబిన్‌లో నిలబడడానికి చోటు లేక బయట వరండాలో నిలబడుతున్నారు. కొందరు మోకాళ్లు, నడుం నొప్పి బాధలతో నిలబడలేక అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు దరఖాస్తుదారులకు కూర్చోవడానికి కుర్చీలను సమకూర్చకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన వరండాలో ప్రత్యేక ఎల్‌ఆర్‌ఎస్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి కంప్యూటర్‌లతో పాటు ప్రింటర్‌లను సమకూర్చాలని దరఖాస్తుదారులకు కుర్చీలు ఏర్పాటు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

● మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



ఇఫ్తార్‌లో పాల్గొన్న మలక్‌పేట్ ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): అల్లా దయ వల్ల ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లోని జీనత్ ఫంక్షన్ హాల్‌లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ పార్టీని ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ పార్టీలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం రంజాన్ ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా దయ వల్ల ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు సమీ, హబీబ్ ఖాన్, జియా అహ్మద్, చాలం చావుస్, హైమద్ చావుస్, అబీద్ ఫారుఖీ, షేర్ ఖాన్, నవీద్ రజా, ఆదిల్, ఏజాజ్‌లతో ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ సెంటర్‌ను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకురాలు

నందిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని బుధవారంరాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి తనిఖీ చేశారు.మాస్‌కాపీయింగ్‌కు పాల్పడు తున్న ఇన్విజి లేటర్‌కు మెమొ ఇచ్చినట్లు సమాచారం. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే ఉపేక్షించేది లేదని, సెంటర్‌లో పని చేసే అందరిపై చర్యలు ఉంటాయని రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి హెచ్చరించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు సూచించారు ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు

మోస్రా,మార్చి26(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పెరుగుతున్న ఎండలకు ప్రజల దప్పిక తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. మండల కేంద్రం మీదుగా కారేగావ్, లక్ష్మాపూర్, మేడిపల్లి, లక్ష్మిసాగర్ తండా గ్రామాల ప్రజలు పలు అవసరాల నిమిత్తం వస్తూ వెళ్తూ ఉంటారు. కావున ఈ చలివేంద్రం అందరికి అందుబాటులో ఉంటుంది. కావున వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ పంచాయతీ అధికారి నాగరాజు, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో మధురిమ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎత్తొండలో ఉపాధి హామీ పనుల పరిశీలన

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ చెరువులో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. పని ప్రదేశం వద్ద కూలీలకు కల్పించిన వసతులపై ఆరా తీశారు. కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. ఎండకాలం దృష్ట్యా ఉదయం వేళల్లోనే పనులను నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో గంగారాం తదితరులున్నారు.

బకాయిలపై వడ్డీ 90శాతం మాఫీ

ఆర్మూర్‌టౌన్ మార్చి26(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈనెల 31వరకు ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీని 90శాతం మాఫీ చేస్తున్నట్టు ఈఅవకాశాన్ని బకాయిదారులు వినియోగించుకోవాలని ఆయనబుధవారం ఒకప్రకటనలో కోరారు.

భీమ్‌గల్:2024-25ఆర్థికసమస్య ముగుస్తున్నందున భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని ఇంటిపన్ను, వాణిజ్య సముదాయాల పన్ను బకాయిల పడ్డ వారికి 90శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు.ఈఅవకాశాన్ని మార్చి31లోపు వర్తిస్తుందనిపట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోని పన్నులు చెల్లించాలని కమిషనర్ తెలియజేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒకరోజు జైలు

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీన డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన గంగాధర్ అనే వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు రుద్రూరు ఎస్ఐ సాయన్న తెలిపారు. రుద్రూరు మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించగా గంగాధర్ తాగి వాహనం నడుపుతుండడంతో అతనిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. ఈ మేరకు న్యాయమూర్తి సదరు వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

● ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

ఆర్మూర్‌టౌన్, మార్చి26(ఆంధ్రజ్యోతి) ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగలను జరుపుకోవాలని ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. బుధవారం: పట్టణంలోని మార్కెట్‌యార్డులో ముస్లీం సోదరులకు అధికారికంగా ఏర్పాటు చేసిన ఆర్మూర్, ఆలూర్ మండలాల ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, కమిషనర్ రాజు, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మహమూద్‌అలీ, రహమన్, ఇంతియాజ్, ఫయాజ్, పాల్గొన్నారు.

కాకతీయలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మెండోర, మార్చి26(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో సోమవారం కాకతీయ కాలువలో గల్లంతైన రాజారాం(28) మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సమీప బంధువు మారుతి ఆదివారం కాకతీయ కాలువలో కాలకృత్యాలకు వెళ్ళి గల్లంతు కాగా అతని ఆచూకి కోసం ద్విచక్ర వాహనాలపై రాజారాం, వినాష్ కాకతీయ కాలువ వెంట వెళ్తుండగా సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాకతీయ కాలువలోకి దూసుకెళ్ళింది. వెనకల ఉన్న అవినాష్ దుకాణంతో ప్రాణాలతో బయటపడ్డారు. రాజారాం కాకతీయ కాలువలో గల్లంతయ్యారు. రాజారాం మృతదేహం వెల్కటూర్ గ్రామ శివారులో బుధవారం లభ్యమైందని మృతుడు బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

ఇంటి పన్ను అపరాధ రుసుముపై 90శాతం రాయితీ

● బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల కోసం ఆస్తిపన్ను, ఇంటి పన్నుల బకాయిలపైన విధించిన అపరాధ రుసుముపైన 90శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. బుధవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 31, 2025వరకు ఉన్న ఆసి పన్ను బకాయిలపై విధించిన పెనాల్టీ మొత్తంలో 90శాతం మాఫీ ఉంటుందన్నారు. మొత్తం బకాయిలు చెల్లించిన వారికి మాత్రమే ఈ బకాయిలు వర్తిస్తాయన్నారు. పట్టణ ప్రజలు తమ పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. పట్టణంలోని మున్సిపల్ వ్యాపారస్థులు, దుకాణ యాజమానులు, పాఠశాల యాజమానులు తమ పన్నుల బకాయిలను పూర్తిగా చెల్లించి బోధన్ పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



తాళ్లరాంపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్ ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ.15లక్షల ఎన్ఆర్ఈజీస్ నిధులు మంజూరీ చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మత్యాల సునీల్ కుమార్‌కి,జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో సుదర్శన్,రామాగౌడ్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

రాంనగర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నందిపేట:మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో బుధవారం సిమెంట్ రోడ్డుపనులను భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రారంభిం చారు. కాలనీలో సుమారు మూడు రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చుతున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు పటేల్ల రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగ సురేష్, మాజీ ఎంపిటీసీ సభ్యులు ఎలిగేటి, నాయకులు గంగాధర్ గౌడ్, లిం గారెడ్డి, హన్మాండ్లు, నాగ తారక, శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

బీర్కూర్: బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో 30 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. బుధవారం ఎంపీడీవో భానుప్రకాష్, ఎంపీవో మహిబూబ్‌లు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. వారి వెంట పీఆర్ఏఈ గోపినాథ్, గ్రామ పంచాయితీ కార్య దర్శి గురునాథ్, నాయకులు శ్రీనివాస్, రాజు, వీరప్ప తదితరులు ఉన్నారు.

ఆర్మూర్ మహిళా సమాఖ్యకు ప్రథమ అవార్డు



ఆర్మూర్ మండల సమాఖ్యకు రాష్ట్రస్థాయి ప్రథమ అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క

ఆర్మూర్‌రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండల సమాఖ్యకు స్త్రీనిధిలో రాష్ట్రస్థాయిలో ప్రథమ అవార్డు లభించింది. బుధవారం హైదరాబాద్‌లో స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆర్మూర్ ఏపీఎం గంగారాం, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్పందనకు రాష్ట్రసాథయి ప్రథమ అవార్డు పురస్కారం చేశారు. స్త్రీనిధిలో రుణాలు అందజేసి సకాలంలో రికవరీ చేసినందుకు గాను ఈ పురస్కారం లభించింది.

● స్త్రీనిధి మేనేజర్‌కు ఉత్తమ పురస్కారం

ముప్కాల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల సమైఖ్యలో స్త్రీనిధి మేనేజర్‌గా విదులు నిర్వహిస్తున్న మురళీకృష్ణకు రాష్ట్రస్థాయి ఉత్తమ మేనేజర్ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మంత్రి సీతక్క చేతుల మీదుగా ఉత్తమ అవార్డు మురళీకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ముప్కాల్ మహిళ సమాఖ్యలో తనకు సహకరించిన మహిళలకు, ఏపీఎం ప్రసాద్‌రావుకు సీసీలుకు, ఏవోలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మోతెలో బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా అధికారి

వేల్పూర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు వేల్పూర్ మండలం మోతె గ్రామంలో మంగళవారం రాత్రి 8.30 గంటల నుంచి 12.30గంటల వరకు ఫైలేరియా, నైట్‌బ్లడ్‌సర్వే నిర్వహించారు.గ్రామపంచాయతీ, ప్రాథమి క ఆరోగ్య కేంద్రాలతో పాటు ఇంటింటికి వైద్యసిబ్బంది తిరుగుతూ 231మందికి రక్త నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుక్కారంరాథోడ్ పర్యవేక్షించారు. ఈ కార్య క్రమంలో వైద్యాధికారి శరత్‌చంద్ర, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయి,సీహెచ్‌వో నారాయణ, సూపర్‌వైజర్ తబిత, హెల్త్ అసిస్టెంట్ ఆరోగ్య కార్యకర్తలు ల్యాబ్ టేక్నిషియన్ ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

భీమ్‌గల్‌రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి) బడాభీమ్‌గల్‌లో ఉన్న కప్పలవాగు నుంచి బుధవారం ఉదయం6గంటల ప్రాంతంలో అక్ర మంగా ఇసుక తరలిస్తున్నారని పక్క సమాచారం మేరకు అక్కడికి వెళ్ళగా పోలీసులను చూసి పారిపోతున్న నాలుగు ట్రాక్టర్‌లను పట్టుకొని సీజ్ చేసిన ట్టు ఎస్సై మహేష్ తెలిపారు.ట్రాక్టర్ డ్రైవర్‌లపై కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.ఈసందర్భంగా ఎస్సైమహేష్ మాట్లాడుతూ అక్ర మంగా ఇసుక మొరం, నల్ల మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని ఎస్సై హెచ్చరించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఏసీపీకి ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆరర్మూర్‌టౌన్,మార్చి26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండిసంజయ్ అనుచిత వ్యాఖ్యాలపై ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ మాట్లాడుతూ తెలంగాన రాష్ట్ర సాధకుడు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటని, తక్షణమే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సర్వసమాజ్ అధ్యక్షుడు సుంకరి రవి, సీనియర్ నాయకులు దొండి శ్యామ్, మీర శ్రావణ్, గుండాల పృధ్వీరాజ్, అగ్గుక్రాంతి, శ్రీకర్, పాల్గొన్నారు.


● ఆధ్యాత్మిక ప్రసంగంలో పాల్గొన్న ముస్లింలు


నేడే షబ్-ఏ-ఖద్ర్

● దివ్య ఖురాన్ అవతరించిన మహోన్నత రోజు

కమ్మర్‌పల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చాంద్రమానం ప్రకారం రంజాన్ తొమ్మిదవ నెల, రంజాన్ మాసంలోని 27వ రోజును షబ్-ఏ-ఖద్ర్ (జాగ్ నేకీ రాత్, బడీ రాత్)గా ముస్లింలు కొలుస్తారు. ఈ రోజు రాత్రి జాగరణ పాటించడం అనవాయితీ. షబ్-ఏ-ఖద్ర్ రోజునే అంతిమ దైవ గ్రంథం దివ్య ఖురాన్ అవతరించిన మహోన్నత రోజు రాత్రిగా ముస్లింలు విశ్వసిస్తారు. అందుకే ఈ రోజు రాత్రిని శుభప్రదమైన రాత్రిగా కొలుస్తారు. మహమ్మద్ ప్రవక్త (సల్లెల్లాహువలైవసల్లెం)మక్కాలోని హీరా పర్వత గుహల్లో దైవారాధనలో నిమగ్నుడై ఉండగా.. హజ్‌రత్ జిబ్రయీల్ (అలైసలాం) అవతరించి ఖురాన్‌లోని కొన్ని శ్లోకాలను ఆయనతో చదివిస్తాడు. దీనినే వహీ(దివ్యవాణి) అంటారు. హదీస్‌ల ప్రకారం ఈ రోజు రాత్రి జిబ్రాయీల్ అనబడు గొప్ప దైవదూత.. తన వేలాది మంది సిబ్బందితో అల్లాహ్ ఆజ్ఞలను తీసుకొని భూమిపై ఆవతరించిన రోజు రాత్రిగా కొలుస్తారు. షబ్-ఏ-ఖద్ర్ రోజు రాత్రి చేసిన ప్రత్యేక ప్రార్థనలు వేయి రాత్రుల పుణ్యాల ఫలితం దక్కుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఈ రోజు రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తే పాపపరిహారం లభిస్తుందని మత పెద్దలు చెబుతారు.

ప్రార్థనలతో పాపపరిహారం

: షేక్‌అహ్మద్ పాషా అమీర్, సహెబ్, కమ్మర్‌పల్లి



రంజాన్ సందర్భంగా ఉపవాసాలు ఉంటు ప్రతిరోజు ఐదు పూటల నమాజ్ తో పాటు ప్రత్యేక తరీవీ నమాజ్ చేయడం పరిపాటి రంజాన్ ప్రారంభంనుండి షబ్ ఏ ఖద్ర్ రోజు రాత్రి వరకు పవిత్ర ఖురాన్ పఠనం పూర్తికావడం. రాత్రంతా నమాజ్ చేస్తు భగవత్ ధ్యానలో గడపడంతో పాపపరిహారం లభిస్తుంది, దైవ చింతన ఆధ్యాత్మికత లభిస్తుంది ఏడాదిమొత్తంలో వివిద పనులతో సతమతమైనప్పటికి పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు, ప్రతిరోజు నమాజ్, దైవచింతనలో గడపడం మానసిక ప్రశాంతతకు మార్గం సుగమం అవుతుంది. ఏడాదిమొత్తంలో రంజాన్ మాసం కోసం వేయికళ్లతో ఎదురు చూస్తుంటాం

విశిష్ట రాత్రి షబ్ ఏ ఖద్ర్

: రేహన్‌ఆలం, సహెబ్, కమ్మర్‌పల్లి



రంజాన్ మాసంలో ప్రతిరోజు నమాజ్ చేయడంతో భగవతుడికి దగ్గరవుతాం షబ్ ఏ ఖద్ర్ రోజు రాత్రి ప్రతేక నమాజ్, ఖురాన్ పఠనం వల్ల పాప పరిహారాలు నివృత్తి అవుతాయని ఒక విశ్వసం రంజాన్ మాసం ప్రార్థనల ద్వార దురాలవాట్లకు దూరమై సత్‌ప్రవర్తన అలవడుతుంది. ఈ రాత్రి ప్రార్థనలు అదృష్టంగా భావిస్తాం.

పేదల ఆర్థిక హక్కు 'జకాత్'

● ఇస్లాంలో సముచిత స్థానం



నందిపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'వఖీముస్సలాత, వతుజకాతా' పవిత్ర ఖురాన్ గ్రంథంలో మనందరి సృష్టికర్త అయిన అల్లాహు తన మానవులకు ప్రథమంగా విధిగా బోధించేది నమాజ్. రెండో విధి ధర్మాన్ని జకాత్ ద్వారా తన భక్తులకు ఆజ్ఞాపించాడు. అంతేకాకుండా ప్రధాన విధి నమాజ్‌లో అన్ని ఆరాధనలకల్లా శ్రేష్ఠమైన ఆరాధరన దైవానికి దాసుడు నమాజ్ ద్వారా దగ్గరవుతాడు. ప్రతీ రోజూ ఐదు పూటల నమాజ్ పటించినందున అన్ని చెడులకు దూరమవుతాడు. దీని ద్వారా స్వర్గానికి ప్రాప్తి పొందుతాడు.

● రెండో విధి జకాత్

జకాత్ ద్వారా తాను సంపాదించిన ధనాన్ని అల్లాహు ఆజ్ఞ ప్రకారంగా ఏడాదికి నూటికి (నగదు నుంచి) 2.5 శాతాన్ని ఆదాయంలో నుంచి మినహాయించి నిరుపేదలైన వారికి (తన బంధువులైనా, ఇతరులైనా) ముస్లింలు ధాన, ధర్మాలు చేస్తారు. ఈ విధి ధానంలో తనకు కల్గిన మొత్తం ఆస్తిలో ఇల్లు, పొలాలు, బంగారం, వెండి, జంతువులు సైతం వెలకట్టి అందులో నుంచి 2.5 శాతం దాన, ధర్మాలు చేయాల్సి ఉంటుంది. ఈ దానధర్మాలు చేయటంలో ప్రతీ మనిషిలో దురాశ నశిస్తుంది. అంతే కాకుండా ప్రపంచ భోగభాగ్యాలను ప్రేమించకుండా పరలోకపు నిజ జీవితం కోసం పాటు పడాలని మనిషిలో పేదలపై దయాధాక్షిణ్యాలు కలుగుతాయి. ప్రతీ వ్యక్తి విధిగా దానం చేసినందుకు భక్తిభావం పెంపొందుతుంది. తన ధనము తనది ఏమాత్రం కాదు.. తన ధనములో నిరుపేదలు, వితంతువులు, అనాధలు, భిక్షాటకులు, వ్యాధిగ్రస్తులు పొందే హక్కు కలదు. దానధర్మాలు చేయటం వలన నరకం నుంచి మానవుడు దూరమవుతాడు. స్వర్గ ప్రాప్తి పొందుతాడు. ప్రతీ ముస్లిం తన సృష్టికర్త అయిన అల్లాహుకు భయపడుతూ ఈ రంజాన్ మాసంలో తమకు కలిగిన స్థోమతను బట్టి దానధర్మాలు చేస్తారు. అంతే కాకుండా అల్లాహు ప్రసన్నం కోసం ఎక్కువ మొత్తంలో దానధర్మాలు చేస్తారు. భక్తిలో నీలమై అంకిత భావంతో 'జకాత్' ను తూ.చా. తప్పకుండా పాటిస్తారు.

● ఫిత్రాకు కూడా ప్రాముఖ్యత

జకాత్‌తో పాటు ఫిత్రాకు కూడా రంజాన్ మాసంలో ప్రాముఖ్యత ఉంది. పేద వారికి పండుగ సందర్భంలో ఎంతో కొంత దానం చేయాలని ఇస్లాం బోధిస్తుంది. దీనినే ఫిత్రా అంటారు. అయితే ఈ ఉపవాస దీక్షలు విజయవంతంగా ముగిసిన అనంతరం దేవుడి పట్ల కృతజ్ఞత భావంతో సంతోషంగా పేదలకు ఫిత్రా ఇస్తుంటారు. ఫిత్రాలో ఆహర ధాన్యాలు లేదా కుటుంబానికి ఒక్క రోజుకు అవసరమైన సొమ్మును కుటుంబ సభ్యులందరి తరఫున కుటుంబ యజమానికి అందజేస్తారు. ఈ దానంతో సర్వ పాపాలు హరించబడుతాయని, కుటుంభ సభ్యులందరికీ పుణ్యం దక్కుతుందని అల్లా నిర్దేశించాడు. ఈ ఉపవాసాన్ని పాటించే సమయంలో హృదయంలో చోటు చేసుకునే చెడు తలంపులు, నోటి నుంచి వెలువడే అసత్య పలుకులు ఫిత్రాతో క్షమించ బడుతాయని ముస్లింల ప్రగాఢ నమ్మకం.


నందిపేటలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


బజార్‌కొత్తూర్‌లో నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

ఆంధ్రజ్యోతి పరిశీలన

గుప్పుమంటున్న గంజాయి

● నిజామాబాద్ జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న అమ్మకాలు ● యువతే లక్ష్యంగా అక్రమార్కుల దందా ● ఇతర రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా దిగుమతి ● నియంత్రణలో ఎక్సైజ్ శాఖ, పోలీసులు విఫలం ● మత్తులో చిత్తవుతున్న యువత

బోధన్ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాదారులు శ్మశాన వాటికలను సైతం వదలడం లేదు. శ్మశాన వాటికలు జన సంచారం లేకుండా ఉండడంతో రాత్రిపూట వాటిని అడ్డా చేసుకుని అక్రమ దందా వ్యాపారానికి కొత్తగా తెర లేపారు. ఇటీవల బోధన్ పట్టణ శివారులోని శ్మశాన వాటిక వద్ద రెండు కిలోల గంజాయి అక్రమ రవాణాదారులను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకోవడమే నిదర్శనం. గంజాయి విక్రయదారులు చివరికి శ్మశాన వాటికలను సైతం వదలడం లేదు. బోధన్‌లో చిన్నచిన్న కూరగాయల షాపుల్లో సైతం చిన్నచిన్న ప్యాకెట్‌లుగా తయారు చేసి గంజాయి దందా కొనసాగుతోంది.



● ఆచన్‌పల్లిలోని వైకుంఠధామం

జిల్లాను ఆవహిస్తున్న గంజాయి మత్తు

బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాను గంజాయి మత్తు అవహిస్తోంది. ఇటీవల గంజాయి రవాణాదారులు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ మార్గాలలో గంజాయిని పట్టణం, నగరానికి తీసుకువచ్చి విచ్చలవిడిగా అమ్మకాలు చేపడుతున్నారు. యువతే లక్ష్యంగా చేసుకుని పలు ప్రాంతాలలో గంజాయి విక్రయాలు జోరుగా కొసాగుతున్నాయి. బోధన్ డివిజన్‌లో, జిల్లా కేంద్రంలో గంజాయి ఆందోళన కలిగించే స్థాయికి చేరుకుంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే తపుడు ఆలోచనతో కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి రకరకాల పద్దతులలో రవాణా చేసి ఇక్కడ అధిక రేటుకు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారు. గంజాయి అమ్మకాలు పట్టణం, నగరంలో జనాలు సంచరించే ప్రాంతాలు, దినసరి కూలీల అడ్డా, యువత, విద్యార్థులు ఎక్కువగా సమయం గడిపే ప్రధాన కూడళ్ల, రైల్వే స్టేషన్‌లు, బస్సు స్టేషన్‌లు, నిర్మానుష్య ప్రాంతాలను స్థావరాలుగా చేసుకుని గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారు చిత్తవుతుంటే.. విక్రయదారులు లక్షల డబ్బులు సంపాదిస్తూ యథేచ్ఛగా చీకటి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం

: శ్రీనివాస్, బోధన్ ఏసీపీ



యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఉక్కుపాదం మోపుతామని, గంజాయి అమ్మకాలు లేకుండా పకడ్బంది చర్యలు చేపడతామన్నారు. ఇటీవల గంజాయి అమ్మకాలు చేస్తున్న వారి రహస్య స్థావరాలను తెలుసుకుని నియంత్రించడం జరిగిందన్నారు. మరోమారు ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కళాశాలల్లో యువతకు దురఅలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై దృష్టి సారించవద్దని, చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

చిన్న ప్యాకెట్‌లలో విక్రయాలు

గంజాయి అమ్మకందారులు రకరకాల పద్ధతుల్లో ఎవరికి అనుమానం రాకుండా గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్‌లుగా చేసి అమ్ముతున్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాలలో నిల్వ చేసి యువకులకు, దినసరి కూలీల వ్యసనాలను ఆసరాగా చేసుకుని అధిక రేటుకు వారికి అంటగడుతున్నారు. వీరు రకరకాల కోడ్‌లు చెప్పుకుంటూ అమ్మకాలు చేసుకోవడం గమనార్హం.

పెరుగుతున్న నేర ప్రవృత్తి

గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతుండడం, విక్రయాలకు అడ్డు అదుపు లేకుండా పోవడంతో గంజాయి వ్యసనపరులు రాత్రి సమయాల్లో గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్నారు. యువత అర్ధరాత్రి వరకు గంజాయి సేవిస్తూ మత్తులో రాత్రి సమయాల్లో వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అనవసరంగా గొడవలు పడుతూ మత్తులో దారుణాలకు పాల్పడుతున్నారు. యువత గంజాయికి అలవాటు పడి తమ బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఒకరికి ఈ వ్యసనం అలవాటు అయితే అది కాస్త చుట్టు ఉన్న వారికి వ్యాపిస్తుంది. ఒకరిని చూసి మరొకరు గంజాయి బారిన పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

పకడ్బందీ చర్యలు చేపట్టాలి

గంజాయి నియంత్రణలో పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉన్న రవాణాదారులపై ఎంత నిఘా పెట్టిన అమ్మకాలు చాప కింద నీరులా విస్తరిస్తూనే ఉన్నాయి. శాంతిభద్రతల వైపు బోధన్ డివిజన్ పోలీసులు దృష్టి కేంద్రీకరించి మంచి పేరు తెచ్చి పెడుతున్న మరో వైపు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపి అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. బోధన్, తదితర మండలాలతో పాటు జిల్లా కేంద్రంలో గంజాయి అక్రమ రవాణాదారులను పట్టుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. పోలీసులు గంజాయి అమ్మకందారులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నప్పటికీ గంజాయి అమ్మకాలు మాత్రం ఆగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని, అమ్మకాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


● బోధన్‌లో వైకుంఠధామం వద్ద గంజాయి విక్రయదారులను పట్టుకున్న పోలీసులు(ఫైల్)

ఫటా..ఫట్...

ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నాం..

: ఎల్.రామ్, ఎస్సై, సిరికొండ



ఆంధ్రజ్యోతి: మండలంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగేవారిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడాన్ని తగ్గించ గలిగాం. దీంతో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. ఎందుకంటే గతంలో బహిరంగా ప్రదేశాల్లో.. ముఖ్యంగా పంటచేలల్లో మద్యం తాగి బాటిళ్లు పగులగొడుతుండే వారు. ప్రస్తుతం గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం గాని, బాటిళ్లు పగులగొట్టడం నిలిచి పోయింది. అంతేకాకుండా ఈ మేరకు కేసులు నమోదు చేయడం వల్లె బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం తగ్గిపోయింది.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో గంజాయి తాగడానికి అలవాటు పడుతున్న వారికి ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఎస్సై: గ్రామాల్లోకి గంజాయి రవాణా కాకుండ విస్తృత తనిఖీలు చేయడం వల్ల గంజాయి రవాణా ఆగిపోయింది. అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం వల్ల మండలానికి గంజాయి రవాణా ఆగిపోయింది. తాగే వారు కూడా చాలా వరకు తగ్గింది. గ్రామాల్లో గంజాయికి బానిస అయిన వారికి కౌన్సెలింగ్ చేయడం వల్ల గంజాయి తాగే వారి సంఖ్యా కూడా చాలా వరకు తగ్గిపోయింది.

ఆంధ్రజ్యోతి: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎస్సై: ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. 80 క్వింటళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పది కేసులు నమోదు చేశాం. కొందరిని రిమాండ్‌కు పంపించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణా చేయకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేయకుండా కఠినంగా వ్యవహరిస్తున్నాం. మూడు కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నాం. పది మంది జేసీబీ డ్రైవర్లు, యజమానులను బైండోవర్ చేశాం.

ఆంధ్రజ్యోతి: పేకాట అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎస్సై: పేకాట ఆడుతున్న వారిని వదలడం లేదు. సమాచారం అందిన వెంటనే స్థావరాలపై దాడులు చేసి పట్టుకుంటున్నాం. దీనిలో భాగంగా ఇప్పటికే మొత్తం 15 వరకు కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించడం జరిగింది.




● ధర్మారం(బి)లో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కన్నుల పండువగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం

డిచ్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గల వేంకటేశ్వర ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ధర్మకర్త రావుల బ్రహ్మానందం దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు స్వామి వారికి అందజేశారు. కాగా, ఆలయ పురోహితులు రాహుల్ త్రిపాటి కల్యాణోత్సవం నిర్వహించారు. ఇందులో భక్తులు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై

ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలి

● కార్యకర్తల సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్

సిరికొండ మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివకుమార్ కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో అమలు చేస్తున్న అబివృద్ధి పథకాలలో ముఖ్యమైనవి రైతుల పంట రుణాల మాఫీ లాంటి సాహసోపేతమైన నిర్ణయాన్ని ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిన విషయాన్ని బాగా ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ముప్పై ఏళ్లుగా అమలుకు నోచుకోని ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టం చేసిన విషయాన్ని కూడా దళిత ప్రజల్లో బాగా ప్రచారం చేయాలని ఆయన కోరారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్టీ కోసం పని చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నకల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఇప్పటి నుంచే వ్యూహాలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు. త్వరలో సిరికొండ మండలంలో జరిగే జై బాపు, జై బీమ్, జై సంవిధాన(రాజ్యాంగం) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతీ కార్యకర్త, నాయకుడు నడుం బిగించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలో పాదయాత్ర ఉంటుందని, నాయకులు సిద్ధం కావాలని కోరారు. అంతకు ముందు కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఆ తర్వాత మండల అధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి గొల్ల ఎర్రన్న, నరేష్, మాలవత్ చందర్, నర్సారెడ్డి, తదితరులు ప్రసంగించారు. ఇందులో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రిక్కా ముత్తెన్న, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పిట్ల నర్సింగ్, శోభన్ యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు ఉమ్మాజి నరేష్, మండల అధ్యక్షుడు ప్రవీన్ వీరు, ప్రవీన్ ఆరే, దేగం సాయన్న, మల్లేష్, రమేష్, నరేందర్, రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సిరికొండలో మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్

అస్తవ్యస్తంగా ప్రత్యేక పాలన

(5వ పేజీ తరువాయి)

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఫైనాన్స్ నిధులు కేంద్రం నుంచి విడుదల కాలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.47.94 కోట్ల నిధులను విడుదల చేయగా ఈ నిధులతో ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిధులు విడుదల చేయకపోవడంతో ఇక పల్లెల్లో అభివృద్ధి పనుల ఊసే లేకుండా పోతోంది. చాలా గ్రామాల్లో మట్టిరోడ్లే దిక్కవు తున్నాయి. పలుచోట్ల డ్రైనేజీ నిర్మాణాలు అసంతృప్తిగానే చేపట్టారు. నిధులు లేక పనులు పూర్తి చేయడం లేదనే వాదన స్థానిక ప్రజల నుంచి వస్తోంది. నిధులు లేకపోవడంతో ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు గ్రామాల నిర్వహణ భారంగా మారుతోంది. పలు పనులకు కార్యదర్శులు తమ సొంత డబ్బులతో పనులు చేయించాల్సిన పరిస్థితి ఎదురవుతుందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీజీఓ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరణ చేస్తున్న కలెక్టర్

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల డైరీని బుధవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులను పకడ్బందీగా అమలుచేయడంలో గెజిటెడ్ అధికారుల పాత్ర ప్రధానమైందని తెలిపారు. కిందిస్థాయి సిబ్బందికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు సలహాలు,సూచనలుచేస్తు ప్రభుత్వకార్యక్రమాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి,విక్టర్, గెజిటెడ్ అధికా రుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్, సెక్రటరీ సాయిరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ అండ్ స్టేట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి,సభ్యులు భూమయ్య,రాజలింగం, మౌనిక పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన అధ్యాపకులు

కామారెడ్డిటౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా నూతనంగా నియామకమైన అధ్యాపకులు బుధవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌ను మార్యదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదువుకొని అధ్యాపకులుగా గెజిటెడ్ హోదా సాధించినందుకు నూతన అధ్యాపకులకు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు. కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెంచి 100 శాతం ఉత్తీర్ణత శాతం వచ్చేవిధంగా కృషిచేయాలని కోరారు. జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎపీసెట్, నీట్‌లో కోచింగ్ ఇవ్వాలని పోటి పరీక్షల్లో విజయం సాధించే విధంగా కృషిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి,ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైన ఉందని మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోటరి క్లబ్‌లో సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలబాలికల అక్రమరవాణా, బాలబాలికలపై జరుగుతున్న హింస నిర్మూలన వంటి వాటిపైన గత రెండు సంవత్సరాల కాలంలో ఎదుర్కొన్న సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో మురళిమోహన్, బీటీఏస్టేట్ కోఆర్డినేటర్ వెంకటేష్, షీటీంసిబ్బంది సౌజన్య, ఏహెచ్‌టీయూ రాజేందర్ పాల్గొన్నారు.

సమన్విత ఆసుపత్రిలో ఎలాంటి వైద్యసేవలు అందించరాదు: డీఎంహెచ్‌వో

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సమన్విత ఆసుపత్రిలో ఎలాంటి వైద్య సేవలు అందించరాదని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. ఆసుపత్రిలో గత రెండు సంవత్స రాలుగా చాలాకాలంగా లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని, గర్భ విచ్ఛిత్తి ప్రక్రియలు నిర్వహిస్తున్నారని గమనించి నోటిసులు జారీచేశామని తెలిపారు. గతంలో ఇదే ఆసుపత్రి యాజమాన్యం కౌసల్య హస్పిటల్ పేరుతో అక్రమ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించినందున డేకాయ్ ఆపరేషన్ చేపట్టి ఆ ఆసుపత్రిని సీజ్‌చేశామని తెలిపారు. అయినప్పటికి యాజమాన్యం తమతీరు మార్చుకోకుండా అక్రమ సంపాదన మార్గంకు అలవాటు పడి ఇదే యాజమాన్యం కొత్తగా సమన్విత హస్పిటల్ పేరుతో మరోక కొత్త ఆసుపత్రి ప్రారంభించిందని ఈ ఆసుపత్రిలో యాదేచ్ఛగా స్కానింగ్‌లుచేస్తు గర్భవిచ్ఛిత్తి ప్రక్రియలు చేస్తుందని తెలిపారు. జూలై 2024లో ఈ ఆసుపత్రి యాజమాన్యం ఒక ఆడశిశువు విక్రయం కేసులో పాలు పంచుకోవడం జరిగిందని యాజమాన్యంసభ్యులైన ఇట్టెం నడిపిసిద్దిరాములు, డాక్టర్ ఇట్టెం ప్రవీణ్‌కుమార్‌లపై కేసు నమోదుచేయడం జరిగిందని అప్పుడు ఆసుపత్రిని సీజ్‌చేశామని తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యం కోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టేని విధించిందని దీంతో మరోమారు వాహనంలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని సమాచారం రావడంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని తెలిపారు. కోర్టు ఆదేశాలు దిక్కరించి ఏవైన కార్యకలపాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా సమన్విత ఆసుపత్రి యాజమాన్యంలో ఒకరైన డాక్టర్ ప్రవీణ్‌కుమార్ జిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తుండగా అయనను రాష్ట్రవైద్యఆరోగ్యశాఖకు సరేండర్ చేశామని తెలిపారు. అతనిపై క్రమశిక్షణ చర్యల కింద కోమురంభీం ఆసీఫాబాద్ జిల్లాకు బదిలీచేయడం జరిగిందని డీయంహెచ్‌వో తెలిపారు.

హనుమాన్ దీక్ష స్వాముల కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడలోని కరపత్రాలను ఆవిష్కరించిన పోచారం

బాన్సువాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండల శ్రీ హనుమాన్ దీక్ష స్వాముల మహా పడిపూజ కరపత్రాలను బుధవారం తన స్వగృహంలో ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేది మంగళవారం నాడు అంగరంగ వైభవంగా స్థానిక విద్య జ్ఞాన సరస్వతి దేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహిం చనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హనుమాన్ దీక్ష పీఠం పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామి జీ వారి కనకములచే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 8.15 నిమిషాల నుంచి రాత్రి 11.50 వరకు అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. శ్రీ ఆంజనేయ స్వామి దీక్ష స్వాముల 16వ సామూహిక మహా మండల పూజ, విశ్వ శాంతి కొరకు సుదర్శన సహిత అష్టోత్తర 108 శత కుండాత్మక 158వ మహా యజ్ఞం,చ శ్రీ భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, పూజా మహోత్సవం, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో అధిక సంఖ్యలో హాజరై మహా మండల పూజ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన సరస్వతి దేవి ఆలయం ప్రధాన అర్చకులు కాశీ సంతోష్ శర్మ, బాన్సువాడ సొసైటీ ఛైర్మన్ ఎరవాల కృష్ణారెడ్డి, బాన్సువాడ నల్ల పోచమ్మ ఆలయం గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు పటేల్‌తో పాటు హనుమాన్ దీక్ష సేవా సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శులు అంబిలి పూర్ రాజు స్వామి, పాలకుర్తి దత్తు స్వామితో పాటు మండల కన్వీనర్ గాండ్ల తేలి ఉమా మహేష్ కుమార్ స్వామితోపాటు ప్రతినిధులు గోక న్ శంకర్ గౌడ్, స్వామి, కల్లేటి వెంకటరమణ స్వామి, కాల గడ్డ నరేష్ స్వామి ,చంద్రశేఖర్ స్వామి, ఉమేష్ స్వామి, ఏ ల్లగోని సాయిబాబా గౌడ్‌తో పాటు హనుమాన్ మాలధరించిన స్వాములు, తదితరులు, పాల్గొన్నారు.

కన్నీటి పర్యంతమైన ప్రభుత్వ సలహాదారులు పోచారం

● అంబర్‌సింగ్ పార్థీవ దేహం వద్ద నివాళులర్పించిన పోచారం

బాన్సువాడ: బాన్సువాడ మండలం దేశాయ్ పేట్ సొసైటీ వైస్ ఛైర్మన్ అంబర్ సింగ్ మంగళవారం గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రభు త్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అంబర్ సింగ్ స్వగ్రామం బాన్సువాడ మండలం రాంపూర్ తండాకి బుధవారం ఉదయం హైదరా బాదు నుండి నేరుగా రాంపూర్ తండా కు వెళ్లి అంబర్ సింగ్ పార్థివ దేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. అంబర్ సింగ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని పోచారం కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ అంతిమయాత్రలో నియోజకవర్గ నాయకు లు, ప్రజాప్రతినిధులు తండావాసులు పాల్గొన్నారు.

నేడు తాడ్వాయిలో 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక'

తాడ్వాయి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఒకే దేశం ఒకే ఎన్నిక పై అవగాహన నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు వెల్మసంతోష్‌రెడ్డి తెలిపారు. దీనికి వివిధ గ్రామాల నుండి పార్టీల కచ్చితంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పై అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నీట్, ఎప్‌సెట్, ఎంసెట్ కోచింగ్ సెంటర్ల పేరుతోఅనుమతులు లేకున్న ఇష్టారితిన నడుపుతున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిసంఘనాయకులు నాగరాజు, వినోద్‌నాయక్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లానోడల్ అధికారి షేక్‌సలాంకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా హా స్టల్ వసతి కల్పిస్తామని విషయపరిజ్ఞానం లేనివారితో సెంటర్‌లు నడిపిస్తూ మంచి అనుభవం ఉన్నవారిని మభ్యపెడుతూ విద్యా ర్థుల ను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి అయిన కళా శాలల్లోని విద్యార్థులను సర్టిఫికెట్‌ల పేరుతో భయబ్రాంతులకు గురి చేస్తే అదే కళాశాలల్లో ఇష్టారితిన కోచింగ్ సెంటర్‌లు నిర్వహి స్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కానిస్టేబుల్,హోంగార్డుల సస్పెన్షన్

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి):విధినిర్వహణలో దురుసుగా ప్రవర్తించిన బాన్సువాడ పోలీసుస్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కిరణ్, హోంగార్డు గంగాధర్‌లను సస్పెండ్‌చేసినట్లు ఎస్పీరాజేష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం పాతబాన్సువాడ పట్టణంలోని కల్లుదుకాణంలో గొల్ల శ్రీనివాస్ అనే వ్యక్తికల్లు తాగిన్యూసెన్స్ చేస్తున్నాడని సమాచారం వచ్చింది. బ్లూ కోల్ట్ విధులలో ఉన్న ఎస్.కిరణ్, హోంగార్డు ఇద్దరు అక్కడికి వెళ్లి మద్యం తాగి ఉన్న శ్రీనివాస్‌పై దురుసుగా ప్రవర్తించారని దీంతో ఆ ఇద్దరిని తాత్కలికంగా విధులనుంచి సస్పెండ్‌చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష

కామారెడ్డిటౌన్,మార్చి26(ఆంధ్రజ్యోతి):భిక్కనూరు పోలీసుస్టేషన్ పరిధిలోని వివాహిత మరణానికి కారణమైన నిందితులకు 3 ఏళ్ల జైలు శిక్ష రూ.3వేల జరిమానాను న్యాయమూర్తి సుమలత విధించినట్లు ఎస్‌పీ రాజేష్ చంద్రతెలిపారు.భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన బొజ్జ దివ్య అదే గ్రామానికి చెందిన రమేష్‌ను ప్రేమవివాహం చేసుకుంది. దివ్య వేరే వ్యక్తితో అక్రమసంబంధం పెట్టుకుందని బొజ్జ చిన్న బాలయ్య, సింగిలి వంశీలు వేధించడంతో 2023 జూలై 7న ఇంట్లో కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యచేసుకుంది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు తూ మృతిచెందింది. దీంతో భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో మృతురాలి అన్న పరుశురాములు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుచగా విచారణ జరిపి కోర్టు బుధవారం నిందితులకు శిక్షను ఖరారు చేసిందని ఎస్పీ తెలిపారు.

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్, ఎస్‌పీ రాజేష్‌చంద్రలు హాజరై మాట్లాడుతూ ఉద్యోగులందరూ కులమతాలకు అతీతంగా సొదరభావంతో ఉండడం గొప్పవిషయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపుకలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్,టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి,కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జిను కలిసిన డీసీసీ అధ్యక్షుడు

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని ఆల్‌ఇండి యా యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షినటరాజన్‌ను కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలోని పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషిచేయాలని స్థానిక ఎన్నికలలో పార్టీ గెలుపుకు కృషిచేయాలని మీనాక్షి నటరాజన్ తెలి పారని అన్నారు. జైబాపు,జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాల్లో పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తు ప్రజలకు వివరించాలని తెలిపారని అన్నారు.

పారిశుధ్యంపై పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

జుక్కల్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో చెత్తాచెదారంతో నిండిపోయింది. జుక్కల్ మండల కేంద్రంలో వివిధ వార్డులో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది మురికికాలు వలు శుభ్రం చేయడం లేదని వార్డు ప్రజలు పేర్కొం టున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి సంవత్సరం అయిపోయిందని ప్రత్యేక పాలనలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నారని తెలిపారు. వేసవికాలంలో జుక్కల్ మండలం మైబాపూర్‌గ్రామంలో త్రాగు నీటి ఎద్దడి నెలకొంది. గ్రామాలలో పాలకవర్గాలు నియమిస్తే గ్రామాలు శుభ్రంగా మారుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

పోక్సోకేసులో ఒకరి అరెస్టు

గాంధారి,మార్చి 26(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలో ఒకరిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని ఒక గ్రామంలో కన్నబోయిన వేణు అనే వ్యక్తి మైనర్ అమ్మాయిని ప్రేమిస్తున్నానని చెప్పి ఆమెను శారీరకంగా లోబర్చుకోవడంతో పాటు ఎవరికైన చెబితే చంపేస్తానని బెదిరించడంతో బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని తెలిపారు. డీఎస్‌పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో విచారణ జరిపి వేణుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.అదేవిధంగా మండలకేంద్రంలోని బాలరాజుగుడి ముందు ఉన్నవెంచర్‌లో పేకాటఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్‌చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7910 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీ నం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

తాడ్వాయి,మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడల్ గ్రామమైన సంతాయి పేట్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల పనులను జడ్పి సీఈవో చందర్ నాయక్ ప్రారంభించారు. అనంతరం ప్రతి గ్రామంలోని ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపిఓ సవిత రెడ్డి, ఏపీఓ కృష్ణ గౌడ్, టిఏ మహిపాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, అధికారులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

వికలాంగుల విద్యార్థులకు వైద్య పరీక్షలు

రామారెడ్డి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని వైద్యుడు వెంకటస్వామి పేర్కొన్నారు. రామారెడ్డి మండల వైద్యాధికారి కార్యాలయంలో వికలాంగుల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు, సతీష్, శశికుమార్, ఐఈఆర్‌పీ సృజన, లక్ష్మణ్, శోభ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట ఫైనాన్స్ నిర్వాహకుల ఇళ్లల్లో సోదాలు

● పలు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సీజ్

లింగంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో ఫైనాన్స్ నిర్వాహకుల ఇండ్లలో బుధవారం ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో సోదాలు చేసి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను సీజ్ చేశారు. సీఐ విలేకర్ల సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదేశాల మేరకు లింగంపేటకు చెందిన జక్కని బాబా, కౌడ రవి, పారిపల్లి సంతోష్‌ల ఇండ్లలో సోదాలు చేశారు. వీరిపై గత ఏడాది కేసలు నమోదు చేసినట్లు ఆయన తెలియజేశారు. వీరి ఇళ్లలో వడ్డీ వ్యాపారానికి సంబందించిన ఎలాంటి ఆధారలు దొరకలేదని ఆయన తెలియజేశారు. అనంతరం సంతోష్ దుకాణంలో సోదాలు చేయగా నాలుగు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, బంగారం, తనఖాపెట్టుకున్న డాక్యు మెంట్‌తో పాటు రూ.90వేల నగదును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన డాక్యు మెంట్లు, నగదు తదుపరి చర్యల నిమిత్తం కలెక్టర్‌కు పంపుతామని చెప్పారు. సంతోష్‌పై మనీ లాండరింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సోదాలలో సీఐతో పాటు స్టేషన్ ఇన్‌చార్జీ ఏఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుస్వామి జాతర ఉత్సవాలు

లింగంపేట,మార్చి 26(ఆంధ్రజ్యోతి):లింగంపేట మండల కేం ద్రంలోని అయ్యపల్లి అడవులలో స్వయంభూగా వెలసిన ప్రభుస్వామి ఉత్సవాలు బుధవారం ఎండ్లబండ్ల ప్రదక్షణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లాలోని వివిధ మండలాల నుంచి,మహారాష్ట్ర,కర్నాటక రాష్ట్రల నుంచిభక్తులు తరలి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీర్వాదం పొందా రు. స్వామివారిని మాజి ఎమ్మెల్యే సురెందర్ దర్శించు కున్నారు. గురు వారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయనిర్వాహకులు తెలియజేశారు.

'విద్యాశాఖలో ఏవీ వెంకటేశం పనితీరును ఆదర్శంగా తీసుకోవాలి'

ఎల్లారెడ్డి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పాలనాపరంగా అనుభవజ్ఞుడు ఆయన పనితీరును ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలని డీఈఓ రాజు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ముత్యపు రాఘవులు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎల్లారెడ్డి ఎంఈఓ వెంకటేశం పదవీ విరమణ సన్మాన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని విధి నిర్వహణలో చేసిన మంచి పనులు జీవితంలో మిగిలిపోతాయన్నారు. విద్యాశాఖలో ఆయన పనితీరు అనుభవజ్ఞం చాలా గొప్పతనం ఇతరులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వివిధ మండలాల ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అఖండ శివనామ సప్తహా

మద్నూర్,మార్చి 26(ఆంధ్రజ్యోతి):డోంగ్లి మండలంలోని లింబూర్‌లో అఖండ శివనామ సప్తహా కొనసాగుతుంది.ఈనెల 24న ప్రారంభమైన అఖండ శివనామ సప్తహా 31 వరకు నిర్వహించనున్నట్లు నిర్వహకులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలో హరినామ సప్తహ, శివనామ సప్తహ, అయ్యప్ప దీక్ష,హనుమాన్ దీక్షశివదీక్షలతో యువకులు దురలవాట్లకు దూరం అవుతున్నారని అందుకే గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు సప్తహ,భజన కార్య క్రమాలపై మక్కువచూపుతున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.గ్రామాలలో భక్తి భావం పెరగడానికి ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు

ఈజీఎస్ సామాజిక తనిఖీపై ప్రజా వేదిక

మద్నూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణ లో బుధవారం 15వ విడత సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహించారు. ఈ ప్రజా వేదిక కు ఎంపీడీవో రాణి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఏ పీడీ వామన్‌రావు ఇతర అధికారులు హాజరయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 2 కోట్ల 54 లక్షల 73 వేల 565లకు సంబంధించిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరిగింది. ప్రజా వేదికలో గ్రామాల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీలు ఆడిట్ చేసిన సభ్యులు నిష్పక్షపాతంగా రిపోర్టును చదివి వినిపించారు. ఆయా గ్రామాలలో ఉపాధి కూలీలు చేసిన పనుల వివరాలను వాటికి సంబంధించిన నిధుల వివరాలను సమావేశంలో ప్రజల ముందు ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకట నర్సయ్య, ఏపీవో పద్మ, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, కూలీలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధుల విడుదలపై హర్షం

మద్నూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ దేవాలయమైన సలాబాత్ పూర్ ఆంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ అభివృద్ధికి 70 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మార్కెట్ కమిటీలో పార్టీ అధ్యక్షులు సాయిలు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రామ్ పటేల్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞా కుమార్, నాయకులు హనుమన్లు స్వామి ,మాజీ సర్పంచ్ విట్టల్ గురుజీ, రమేష్, రవికైలాష్ తదితరులు పాల్గొన్నారు.

బొలేరో ఢీకొని మహిళ మృతి

నిజాంసాగర్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం మంగళూరు గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. నిజాంసాగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై బొలేరా వ్యాన్ అతివేగంఆ రాంగ్ రూట్లో వస్తూ ఉండటంతో ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న సాయిలుకు తీవ్రగాయాలు కాగా విజయలక్ష్మీ మృతి చెందింది. బంధువు అయిన కేశయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

ఆర్‌కే కళాశాలకు హోస్ట్ ఇన్సిట్యూట్‌గా గుర్తింపు

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు హోస్ట్ ఇన్సిట్యూట్‌గా గుర్తింపు లభించినట్లు కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డితెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెషన్యూరిషిప్ అంశాలతో ఇంటింటా ఇన్నోవేటర్ ధ్యేయంగా ఏర్పడిన టీజీఐసీ ప్రతి జిల్లాకు ఒక హోస్ట్ ఇన్సిట్యూట్‌ను ఏర్పాటుచేయడం జరిగిందని అందులో భాగంగా ఆర్‌కే కళాశాలను గుర్తించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ భాస్కర్ రావు,డీన్‌నవీన్‌కుమార్,కోఆర్డినేటర్‌దత్తాద్రి, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

జిల్లాలో రెండు పీహెచ్‌సీలకు నాణ్యత సర్టిఫికెట్

కామారెడ్డిటౌన్/బీర్కూర్ ,మార్చి 26(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని రెండు ప్రా థమిక ఆరోగ్య కేంద్రాలకు నాణ్యత సర్టిఫికేట్‌లు వచ్చినట్లు డీయంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గపరిదిలోని దేవునిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని క్యాసంపల్లి పల్లెదవాఖాన,బాన్సువాడ మండలంలోని దుర్కి పల్లెదవాఖాన ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటి అసెస్ మెంట్ స్టాండర్స్) ద్వారా గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు సేవల ప్రగతిని నిరంతరం పెంచడంలో ఈ పెసిలిటిలు మరింత గొప్ప పురోగతి సాధిస్తాయని తెలిపారు. గత ఫిబ్రవరి నెలలో ఎన్‌క్వాస్ పరిశీలనలో ఈ రెండు ఆసుపత్రులు గుర్తింపు పొందాయని ఒక్కో ఆసు పత్రికి రూ.1.25లక్షలు మూడు సంవత్సరాల పాటు వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు జహీరా, జోహముజిబ్, ఎంఎల్‌హెచ్‌పీ మీనాక్షి, ఏఎన్ఎంలను అభి నందించారు.

గుండెపోటుతో తండ్రి మృతి

● తండ్రి మరణించిన దుఃఖంలోనూ పరీక్షకు హాజరు



పరీక్షకు హాజరైన విద్యార్థి

భిక్కనూరు,మార్చి26(ఆంధ్రజ్యోతి):తండ్రి మరణించిన దు:ఖాన్ని దిగమింగుకొని పదోతరగతి పరీక్షకు కూతురు హాజరైన విషాద ఘటన కామారెడ్డి జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన బీబీపేట సత్యనారాయణ (44)తన భార్య మంజుల, ముగ్గురు కూతుళ్లతో 23ఏళ్ల క్రితమేకామారెడ్డి జిల్లా భిక్కనూరులో స్థిరపడ్డాడు. సత్యనారాయణ ఓ దినపత్రికలో విలేకరిగా పని చేస్తున్నాడు. రోజూలాగే మంగళవారం రాత్రి సత్యనారాయణ భోజనం చేసి నిద్రపోగా.. నిద్రలోనే గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి ముగ్గురు కూతుళ్లలో ఇద్దరు కూతుళ్లు కీర్తన, దీపికలు మండలంలోని జంగంపల్లి జ్యోతిబా పూలే పాఠశాలలో 10, తొమ్మిదో తరగతి చదువుతుండగా.. చిన్న కూతురు అనూష భిక్కనూరులోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యనభ్యసిస్తోంది. బుధవారం 10వ తరగతి పరీక్ష రాసేందుకు వెళుతున్న కీర్తనకు తండ్రి మరణించిన విషయం తెలియడంతో.. పుట్టెడు దు:ఖంలోనూ కుటుంబీకుల ఓదార్పుతో పరీక్ష రాసింది. తండ్రి మృతదేహంపై పడి ముగ్గురు కూతుళ్లు రోదించిన తీరు చూపరులతో కంటతడి పెట్టించింది మరోవైపు.. సత్యనారాయణ ఆర్థిక పరిస్థితి అంతం మాత్రంగానే ఉండడంతో.. ప్రభుత్వం స్పందించి ముగ్గురు కుమార్తెలు ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భిక్కనూరులో ప్రైవేటు ఫైనాన్స్‌లపై పోలీసుల దాడులు

భిక్కనూరు,మార్చి26(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని ప్రైవేటు ఫైనాన్స్‌లపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఫైనాన్స్‌లు నడిపిస్తున్న వారి కార్యాల యాలు, ఇళ్లలో తనిఖీలు నిర్వహించి పలువురి వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, ఇతరితర డ్యాక్యూమెంట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటుగా మండలకేంద్రానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అనుమతి లేకుండా ఫైనాన్స్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

తాడ్వాయి,మార్చి26(ఆంధ్రజ్యోతి):ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని నడవాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి, ఆర్య క్షత్రియ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్ రావులు అన్నారు. మండలంలోని ఎంట్రీయల్ గ్రామంలో ఆర్య క్షత్రియ సంఘం ఆధ్వర్యం లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిం చారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ చేసిన సహా సాలు, హైందవ శక్తికి చేసిన కృషి, భారతదేశ రక్షణకై చేసిన పోరా టాలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు ప్రసాద్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజులు, ఆర్య క్షత్రియ జిల్లా అధ్యక్షుడు నిత్తు వెంకట్రావు, జిల్లా సెక్రెటరీ శివాజీ రావు, ఆర్య క్షత్రియులు రవీందర్రావు కిషన్ రావు, మనోహ ర్రావు, బాలాజీ రావు, బాపురెడ్డి,వెంకట్రావు, సం తోష్‌రావు, భాస్కర్‌రావు, చక్రధర్‌రావు, శివాజీ, సుధాకర్ రావు ఎంట్రియాల్ గ్రామ ఆర్య క్షత్రియ సంఘ సభ్యులు, వివిధసంఘాలఅధ్యక్షులు, గ్రామస్తులు ఉన్నారు.


ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

కామారెడ్డిటౌన్,మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల డైరీని బుధవారం టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి,ప్రధానకార్యదర్శి నాగ రాజు,సహాధ్యక్షుడు చక్రధర్‌లు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అరుణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్, కోశా ధికారి రాజేందర్, సలహదారుడు రాజ్‌కుమార్, ఉపాధ్యాక్షులు పద్మ అన సూయ, మునీర్, ఇక్రమ్,ఇర్ఫాన్, పరమేశ్వరి, నగేష్, మనోజ్ తదితర జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి		బాన్సువాడ	
దర్శన్	ఫైర్	మహేశ్వరి	కోర్ట్
ప్రియా 70	పెళ్లికాని ప్రసాద్	వెంకటేశ్వర	షణ్ముఖ
ప్రియా 35	ఛావా		



చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

